# ఇన్లాండ్ లెటర్ కథలు

## పోస్టుమెన్లున్నారు జాగ్రత్త!



కోటి అనుభూతులతో మెట్టినింట్లో అడుగుపెట్టే కొత్త పెళ్లి కూతురిలాగా, పోస్టింగ్ ఆర్డర్ చేత్తో పట్టుకుని అనిర్వచనీయమైన అనుభూతితో కుడికాలు ఆఫీసులో పెట్టాడు గోపాల్.

డిగ్రీ పూర్తిచేసిన గోపాల్ వుద్యోగాన్వేషణలో అలిసిపోయిన తరుణంలో "ఉత్తర దక్షిణ" లు ఏమీ లేకుండానే ఎఫ్.సి. ఐ. లో టెక్నికల్ అసిస్టెంట్‌గా వుద్యోగం వచ్చింది.

స్వతహాగా మితభాషి అయిన గోపాల్ తన పనేదో తను చేసుకుంటూ, తన సీనియర్స్ దగ్గర సిన్సియర్‌గా ఉండేవాడు.

ఆఫీసులో గోడమీద "పోస్టుమెన్లున్నారు జాగ్రత్త" అనే పేపరు కటింగ్ను తను వచ్చినప్పటినుంచి గమనిస్తున్నాడు. సినిమాహాళ్ల దగ్గర, బస్టాండు దగ్గర "జేబుదొంగలున్నారు జాగ్రత్త!" అనీ, పెద్ద పెద్ద భవంతుల దగ్గర గేట్లకు "కుక్కలున్నాయి జాగ్రత్త!" అని వుంటాయి. కానీ యిక్కడ ఆఫీసులో ఈ హెచ్చరిక అంతుబట్టలేదు గోపాల్‌కు.

టెన్షన్ భరించలేక ఒకరోజు తన సీనియర్‌ను ఆ హెచ్చరిక గురించి అడిగాడు. సీనియర్ గురురాజు చిద్విలాసంగా నవ్వుతూ, గోపాల్‌ను కూర్చోబెట్టుకుని, టీ ఆర్డర్ యిచ్చి, ఈ పోస్టుమెన్లు చాలా డేంజర్. పోస్టల్ వారి పోస్టుమెన్లు వుత్తరాల మూటలు మోస్తుంటారు. కానీ ఈ పోస్టుమెన్లు మాటలు మోస్తుంటారు. మన మేనేజరు గారి మెహర్బానీ పొందాలనీ, వుదయాన్నే ఫ్రెష్‌గా వాళ్లింటికి వెళ్లి, మనమాటలు రిజిస్టర్ పోస్టులో చేరవేస్తుంటారు.

నీకు తెలుసో తెలియదో గానీ, మెట్టినింట్లో ఆడది నెట్టుకు రావాలంటే వంటా–వార్పూ మాత్రమే గాదు లౌక్యం తెలునుండాలి. అదేవిధంగా ఈ ఆఫీసులో 'షైన్' గావాలంటే సి.బి. నేర్చుకోవాలి. అని టీ కప్పు కిందపెట్టి సిగరెట్ అంటించాడు గురురాజు.

ఆశ్చర్యంగా అడిగాడు గోపాల్. మన ఆఫీసులో కొందరు మేనేజరు గారి యింటి దగ్గర "వాడిట్లా అన్నాడు–వీడిట్లా అన్నాడు మిమ్మల్ని.."అని సి.బి. చేస్తూ చెబుతుంటారు.

"ఈ సి.బి. ఏంటి? ఈ పోస్టుమెన్ల గొడవేంటి?– అని గోపాల్ గందరగోళావస్థలో వుండటం చూసి, గురురాజు అతని భుజం తడుతూ "సి.బి. అంటే చెక్కభజన" అని చెప్పాడు.

సిగరెట్ పొగ ఆకాశంలోకి వదుల్తూ గోపాల్ వంక చూశాడు గురురాజు. బాడీ ప్రెజెంట్–మైండ్ ఆబ్సెంట్ పరిస్థితిలో వున్నాడు గోపాల్.

"హలో గోపాల్! ఎక్కడున్నావు" అని భుజం తట్టి, ఈ సి.బి లకు దుబాయ్‌లో ఆర్నెల్లు శిక్షణ యిస్తారట. ఈ పోస్టుమెన్లు యిక్కడే గాదు ప్రతి డిపార్టుమెంటులోను వుంటారు "తస్మాత్ జాగ్రత్త! అంటూ గోపాల్ సందేహాన్ని తీర్చాడు గురురాజు.

పి.డి.ఆర్.రెడ్డి.

## ఎవరో వస్తారని...



"ఛ.. నా. అంత దురదృష్టవంతుడు ఇంకొకడుండడు. ఈ మాట ఇప్పటికి ఎన్నోసార్లు అనుకొని ఉంటాడు సాయి. డిగ్రీ పూర్తి చేసుకున్న సాయి, తెలివితేటలున్నాయే కాని అవకాశం కోసం ఎదురుచూస్తూ ఉంటాడు. అవకాశాలు మాత్రం ఎన్నటికీ రావు. కాని ఈ మధ్య అతని బావకు తెలిసిన ఒకతను సాయికి 'జాబ్ ఇప్పిస్తాను' ఒకసారి కలుసు అని చెప్పటంతో రోజూ..అతను చెప్పిన ప్రదేశానికి రావడం, అతను రాకపోవడంతో నిరాశగా వెళ్లిపోవడం, ఈ విధంగా మూడురోజులపాటు జరుగుతునే ఉంది.

"ఆ రాస్కెల్ అసలు వస్తాడో.. రాడో నాతో ఆడుకుంటూ ఉన్నాడు వెధవ ఛ...నాకే అవకాశం ఉంటేనా.. ఇలా ఒకరికోసం ఎదురుచూసే అవసరం ఉండేదా...! అయినా తప్పదుగా ఉద్యోగం పురుషలక్షణం అన్నారు పెద్దలు. ఎన్ని రోజులైనా ఎదురుచూడక తప్పదు." అనుకుంటూ అతని కోసం ఎదురుచూడసాగాడు సాయి. మరో గంటలో పిల్లల కేరింతలతో, క్రొత్త జంటల కబుర్లతో, సాయిలాంటి నిరుద్యోగుల కలలతో నిండిపోయింది పార్కు. కాని అతను రాలేదు.

చుట్టూ ఉన్న జనాన్ని గమనిస్తున్న సాయి కళ్లు, ఎదురుగా ఉన్న బెంచిపై కూర్చొని తననే గమనిస్తున్న వ్యక్తిపై పడ్డాయి. గత మూడురోజుల నుంచి చూస్తున్నాడు సాయి అతన్ని. మూరపొడవున పెరిగిన గడ్డం, మూడువేళ్లపొడవున పెరిగిన మూతిమీద మీసం, దట్టమైన కనుబొమ్మలు, బారెడు పొడవున జుత్తు, అతని ముఖాన్ని కప్పేస్తుండగా.. చిరునవ్వుతో తననే గమనిస్తూ అప్పుడప్పుడు చేతిలోని పెన్సిల్‌తో కాగితంపై ఏదో గీస్తున్న అతన్ని చూసి పిచ్చివాడనుకున్నాడు సాయి. కాని అతను తననే గమనిస్తుండడంతో కొంచెం ఇబ్బందిగా ఫీలయినాడు. అలా మూడు గంటలు గడచినా తను ఎదురుచూస్తున్న మనిషి రాకపోవడంతో నిరాశగా బయలుదేరబోయిన సాయి "హలో" అన్న పిలుపుతో వెనుదిరిగి చూశాడు. ఎదురుగా గెడ్డం మనిషి.

"నాపేరు విష్ణు. అంటూ తనను తాను పరిచయం చేసుకున్నాడు. నా పేరు సాయి అంటూ అతనికి షేక్‌హ్యాండ్ ఇచ్చాడు సాయి. మరో కొద్ది నిమిషాల్లోనే ఇద్దరూ మంచి మిత్రులైపోయారు. మాటల మధ్యన సాయి తన ఎదురుచూపులకు కారణం తెలిపాడు.

ఓహో..అలాగా..అప్పట్లు మర్చిపోయాను. అంటూ సంచిలో నుంచి ఒక కాగితాన్ని తీసి ఏదోవ్రాసి సాయికి అందించి మరి నేను వస్తాను అంటూ వెళ్లిపోయాడు విష్ణు. వెళ్లిపోతున్న విష్ణు వంక ఒకసారి చూసి అతను ఇచ్చిన కాగితం కేసి చూసిన సాయి "ఫెంటాస్టిక్" అంటూ అప్రయత్నంగా పలికాడు. దానిలో ఉన్నది తన బొమ్మ. అతను గీసిన ఆ బొమ్మ ఫోటో తీసినట్లుగా నాచురల్ గా ఉంది. క్రింద అతను రాసిన కొటేషన్ చదివిన సాయి సిగ్గుతో కుచించుకుపోయాడు. సరిగ్గా తనకు తగ్గట్లే రాశాడు. ఇక నుంచి నా ప్రయత్నం నేను చేయాలి. అనుకుంటూ.. అతను వ్రాసిన "ఎవరో వస్తారని...ఏదో చేస్తారని...ఎదురుచూసి మోసపోకు" అన్న కొటేషన్ కేసి చూస్తూ బయలుదేరాడు సాయి. తను జీవితంలో చేసుకున్న సమయానికి తగ్గ పెనాల్టీ చెల్లించడానికి.

–యం.ప్రేమసాయి.